ప్రజాశక్తి
మంగళవారం 12 మార్చి 2024
5
అనంతపురం





బైరవాని తిప్ప ప్రాజెక్టు (ఫైల్ ఫోటో)



అనంతపురం ఎస్‌బిఐ బ్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఎన్నికల బాండ్లలో బిజెపి కుట్ర

◆ తక్షణం వివరాలను ప్రకటించాలి ◆ ఎస్‌బిఐల ఎదుట ధర్నాలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్


ఎన్నికల బాండ్ల విషయంలో బిజెపి పెద్ద ఎత్తున కుట్ర చేస్తూ అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతోందని సిపిఎం నాయకులు విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎన్నికల బాండ్‌ల వివరాలను ఎస్‌బిఐ తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని ఎస్‌బిఐ బ్యాంకుల వద్ద సోమవారం నాడు ఆందోళనలు చేపట్టారు. అనంతపురం ఎస్‌బిఐ సాయినగర్ ప్రధాన బ్రాంచ్ వద్ద జరిగిన ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, సీనియర్ నాయకులు జి.ఓబులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు సంబంధించిన ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బిఐ ప్రకటించకపోవడం అభ్యంతకరంగా ఉందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల వ్యవస్థను మరింత భ్రష్టు పట్టించిందని విమర్శించారు. 2017లో ఎన్నికల బాండ్ల వ్యవస్థను ప్రవేశపెట్టి వేల కోట్ల రూపాయలను అక్రమంగా తమ ఖాతాలోకి వేసుకుందని విమర్శించారు. విశ్వసనీయత, పారదర్శకత గురించి మాట్లాడే బిజెపి నాయకులు ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు తీర్పుపై ఇప్పటి వరకు స్పందించకపోవడం దాని మోసకారి వైఖరికి నిదర్శనం అన్నారు. ఎన్నికల బాండ్లు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదమని సిపిఎం సుప్రీంకోర్టులో ఫిర్యాదు చేసిందన్నారు. దాని ఫలితంగా గత ఫిబ్రవరి నెలలో తీర్పు వచ్చిందని గుర్తు చేశారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎన్నికల బాండ్లను తక్షణమే రద్దు చేయాలని మార్చి 6వ తేదీ లోపు ఈ బాండ్లు కొనుగోలు చేసిన వారి వివరాలు అందించాలని, మార్చి 13వ తేదీ నాటికి ఏ ఏ పార్టీకి ఎంత మొత్తంలో ఈ బాండ్లు అందాయో ఆన్‌లైన్‌లో ఉంచాలని ఎన్నికల సంఘాన్ని తీర్పులో సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. అయితే ఆ తీర్పును అమలు చేయకుండా జూన్ 30 వరకు తనకు సమయం కావాలని ఎస్‌బిఐ ద్వారా కోర్టులో పిటిషన్ వేయించడం వెనక బిజెపి హస్తం ఉందన్నారు. ఎన్నికల బాండ్ల వల్ల అత్యధికంగా లాభపడింది బిజెపి అనే విషయం బయటకు వస్తే ఎన్నికల ముందు తన నిజ స్వరూపం బట్టబయలవుతుందని ఆ పార్టీ భయపడుతోందన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చివేయడం వెనక ఈ అక్రమ డబ్బు ప్రభావం ఉందన్నారు. అలాగే వేల కోట్ల రూపాయలను ఎన్నికల కోసం ఖర్చు పెట్టడం, ప్రత్యర్థి పార్టీలను భయపెట్టడం అందులోని నాయకులను కొనుగోలు చేయడం అక్రమంగా అధికారాన్ని అనుభవించడం బిజెపి నైజం అని విమర్శించారు. ఎస్‌బిఐ ఉన్నతాధికారులు ఇప్పటికైనా సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాల రంగయ్య, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి, న్యూ టౌన్ కార్యదర్శివర్గ సభ్యుడు ఇర్ఫాన్, ప్రకాష్, పోతులయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

వెనుకబడిన 'దుర్గం'

◆ సాగు,తాగునీటికి తప్పని కష్టాలు
◆ ఉపాధి కోసం పక్క రాష్ట్రాలకు వలసలు
◆ మాటలకే హామీలు పరిమితం

కళ్యాణదుర్గం నియోజకవర్గం అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉంది. సాగు,తాగునీటికి కూడా కటకటలాడే ప్రాంతమిది. అత్యధికంగా వ్యవసాయంపైనే ఆధారపడిన ప్రాంతమైనప్పటికీ నిఖర జలాలు ఏ మాత్రం అందని ప్రాంతమిది. సాగునీటి ప్రాజెక్టు ఒక్కటీ లేదు. కేవలం వర్షాధారంపైనా, భూగర్భ జలాలపై ఆధారపడి పంటలు సాగుచేసుకుని జీవనం సాగించాలి. లేకపోతే ఉపాధి కోసం పక్క రాష్ట్రాలకు వలసలు వెళ్లాల్సి ఉంటుంది. ఈ ప్రాంతానికి కృష్ణా జలాలను తరలిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ పూర్తవ లేదు. కేవలం కాగితాలకే పరిమితమైంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



ముందుకు సాగని భైరవానితిప్ప

ఈ ప్రాంతానికి సాగునీటి వసతిని కల్పిస్తామని అనేక ఏళ్లుగా ప్రకటనలు వెలువడుతూనే ఉన్నాయి. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చాక రూ.967 కోట్లతో జీడిపల్లి నుంచి భైరవానితిప్పకు ఎత్తిపోతల ద్వారా నీటిని అందివ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుకు నీటిని అందించే క్రమంలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని చెరువులకు నీటిని అందివ్వాలన్నది లక్ష్యం. మొత్తంగా 114 చెరువులకు నీటిని అందివ్వాలని నిర్ణయించారు. ఈ ప్రభుత్వం వచ్చాక కూడా ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హామీని రాయదుర్గంలో ఇచ్చారు. ఆచరణలో పనులు ముందుకు సాగలేదు. ఇటీవలే కళ్యాణదుర్గం వచ్చినప్పుడు ప్రాజెక్టుకు అవసరమైన 1405 ఎకరాల భూసేకరణకు నిధులు విడుదల చేసినట్టు ప్రకటించారు. అయితే అవి కొంత వరకే వచ్చాయి. ఇంకా పూర్తి స్థాయి భూసేకరణ జరగలేదు. పనులు అర్థాంతరంగా ఆగి ఉన్నాయి. ఇది వస్తే ఈ ప్రాంతంలోని కొన్ని చెరువులకైనా నీరు వచ్చి పంటలు పండించుకునే అవకాశముంది.



చింతపండు-టమోటా ప్రాసెసింగ్ పరిశ్రమలు హామీలకే పరిమితం

ఈ ప్రాంతంలో అత్యధికంగా టమోటా పంటతోపాటు, చింతపండు పంట కూడా సాగవుతుంది. ఈ పంటలకు సంబంధించి ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసి రైతులకు లాభం చేకూరుస్తామని గత ఎన్నికలకు ముందు మంత్రి ఉషశ్రీచరణ్ హామీనిచ్చియున్నారు. అయితే ఈ హామీ తరువాత ఈ హామీ అటకెక్కింది.

మౌళిక సదుపాయల సమస్యలు

వెనుకబడిన కళ్యాణదుర్గం ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయలు సమస్యగానే ఉన్నాయి. అనేక గ్రామాలకు సరైన రహదారుల నిర్మాణాలు లేవు. డ్రెయినేజీ, తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. అదే సమయంలో వలసలు అధికంగా ఉంటున్నాయి. ప్రధానంగా బ్రహ్మసముద్రం, శెట్టూరు కుందుర్పి తదితర మండలాల నుంచి వలసలు ఎక్కువ. స్థానికంగా ఉపాధి అవకాశాల్లేకపోవడంతో వ్యవసాయ పనులు పూర్తవగానే కేరళ, కర్నాటక రాష్ట్రాలకు వలసలు అధికంగా ఉంటాయి. వీటి నివారణకు తీసుకుంటున్న చర్యలు మొక్కుబడిగానే ఉంటున్నాయి.



పంప్‌హౌస్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

వేతనాల కోసం తాగునీటి కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

వేతనాల కోసం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులు మరోసారి ఆందోళనకు దిగారు. ఇదివరకే వేతనాలు చెల్లించాలని మూడుసార్లు నిరవధిక సమ్మె చేపట్టారు. ఒకానొక దశలో వైసిపి నాయకులు ఆందోళన అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎంపీ తలారి రంగయ్య జోక్యం చేసుకున్నప్పటికీ సకాలంలో వేతనాలు అందలేదు. హామీ ఇచ్చినా వేతనాలు ఇవ్వకపోవడంతో సోమవారం నాడు పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేపట్టారు. మోటార్లను ఆఫ్ చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నీటి సరఫరా కోసం నిరంతరం కష్టపడుతున్న కార్మికులకు వేతనాలు చెల్లించకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయని కార్మికులు ప్రశ్నించారు. ఐదేళ్లుగా వేతనాలు అందక కష్టాలు పడుతున్నామన్నారు. ఒక నెల కూడా సక్రమంగా వేతనాలు చెల్లించిన దాఖలు లేవని మండిపడ్డారు. కాంట్రాక్టర్, ఎంపీ రంగయ్య ఇచ్చిన హామీ కూడా నీటి మూటలుగా మారాయని విమర్శించారు. తక్షణమే వేతనాలు చెల్లించకపోతే నిరవధిక సమ్మె ప్రకటిస్తామన్నారు. ఈకార్యక్రమంలో తాగునీటి పథకం కార్మికులు పాల్గొన్నారు.

25 నుంచి శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇకి సిఐటియు నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బకాయి పడ్డ 4 నెలల వేతనాలు, 11 నెలల పిఎఫ్ తదితర సమస్యల సాధన కోసం ఈనెల 25వ తేదీ నుంచి నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి ఉమ్మడి అనంతపురం జిల్లా తాగునీటి సరఫరా పథకం కార్మికులు సమ్మెలోకి వెళ్తున్నట్లు సిఐటియు నాయకులు రామాంజనేయులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ అసన్‌బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. గత సమ్మె సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం, సమస్యలు జఠిలం కావడంతో కార్మికులు సమ్మెలోకి వెళుతున్నట్లు తేల్చి చెప్పారు. తక్షణమే వేతనాలు ఇస్తామని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి ఇచ్చిన హామీ కూడా అధికారులు అమలు చేయకపోవడం బాధాకరంగా ఉందని నేతలు వాపోయారు. వేతనాలు ఇవ్వకపోతే కార్మికులు కుటుంబాలు ఎలా పోషించుకోవాలని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసారి తాడో పేడో తేల్చుకుంటామని తక్షణమే వేతనాలు చెల్లించకపోతే నిరవధిక సమ్మె తప్పదన్నారు. సమ్మెలోకి వెళ్లాక జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అసలే ఎండాకాలం, ఇప్పటికే తాగునీటి సమస్యలు తలెత్తి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో శ్రీరామిరెడ్డి కార్మికులు నిరవదిక సమ్మెలోకి వెళితే నీటి కష్టాలు జఠిలం అయ్యే ఆస్కారం ఉంది. మరీ ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరిస్తుందో లేదో అన్న ఆందోళనలో కార్మికులు, ప్రజలు ఉన్నారు.



తాగునీరు తెచ్చుకునేందుకు ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు

తాగునీటి కష్టాలు

గ్రామాల్లో ఎండిన బోర్లు..
ఉత్సవ విగ్రహాల్లా నీటి ట్యాంకులు
ప్రజలకు తప్పనితిప్పలు



ప్రజాశక్తి-డి.హీరేహాల్

మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి తాగునీటి పథకాలు ఏర్పాటు చేస్తున్నా నిర్వహణ విషయంలో స్థానిక పాలకులు, అధికారులు చేతులెత్తేయడంతో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. నీటి ట్యాంకులు ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తున్నాయి. విధి లేని పరిస్థితుల్లో ప్రజలు కిలోమీటర్ల మేర వెళ్లి వ్యవసాయ బోరు బావుల నుంచి ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు, తోపుడు బండ్ల ద్వారా నీరు తెచ్చుకుంటున్నారు. అవి లేని వారు కాలినడకనే బోరుబావుల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. మురడి గ్రామంలో వారం రోజు లుగా ప్రజలు నీటి సమస్య ఎదుర్కొంటున్నా అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ స్పందించక పోవడం గమనార్హం. మరికొన్ని గ్రామాల్లో బోర్లు ఎండిపోవడంతో వారంలో ఒకరోజు మాత్రమే నీటిని సరఫరా చేస్తుండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు విద్యుత్ సరఫరాలో కోతల వల్ల నీరు ఎప్పుడు వదులుతారో అని పనులు మానేసి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. చాలా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఇప్పుడే ఇలా ఉంటే ముమ్ముందు సమస్య ఎంత జఠిలం అవుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన అవస రం ఎంతైనా ఉంది.

'అనంత అభివృద్ధి నా బాధ్యత'

◆ దగా పాలనకు స్వస్తి చెప్పేందుకు ప్రజలు సిద్ధం
◆ బాహుబలి టైటిల్‌తో పులకేసి సినిమా చూపించారు..
◆ సిద్ధం సభల్లో జనమంతా గ్రాఫిక్స్
◆ శంఖారావంలో నారా లోకేష్
◆ ఉమ్మడి అనంతలో ముగిసిన యాత్ర



అనంతపురంలో అభివాదం చేస్తున్న నారాలోకేష్ తదితరులు



తాడిపత్రి శంఖారావం సభలో ప్రసంగిస్తున్న నారా లోకేష్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్, తాడిపత్రి రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లా అంటే తమకు ప్రత్యేకమైన అభిమానం ఉంది. టిడిపి అధికారంలోకి రాగానే ఈ జిల్లా అభివృద్ధి బాధ్యతను నేను తీసుకుంటాను' అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలియజేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేపట్టిన శంఖారావ సభలు సోమవారంతో ముగిశాయి. సోమవారం నాడు అనంతపురం, తాడిపత్రి నియోజకవర్గ కేంద్రాల్లో బహిరంగ సభలనను నిర్వహించారు. అనంతపురం రుద్రంపేట బైపాస్ పివికెకె కళాశాల సమీపంలో అర్బన్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, తాడిపత్రి పట్టణంలోని కడప రోడ్డులో నియోజకవర్గ ఇన్‌ఛార్జి జెసి.అస్మిత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభల్లో లోకేష్ ప్రసంగించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైట్ కాలర్ నేరస్తుడన్నారు. క్రిమినల్ రికార్డులు ఉన్నత వరకు జగన్ ఉంటాడని ఎద్దేవా చేశారు. మద్యపానం నిషేదం, సిపిఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్, 45 ఏళ్ల వారికి పింఛన్ తదితర హామీలను ఎందుకు నెరవేర్చలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. జగన్ ఓ చేత్తే రూ.10 ఇచ్చి మరో చేతో రూ.100 లాగేసుకుంటున్నారని విమర్శించారు. దగా పాలనకు స్వస్తి చెప్పడానికి ప్రజలు సిద్ధమయ్యారని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఐక్యమత్యంగా నడుద్దామన్నారు. టిడిపికి కార్యకర్తలే బలం అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా అంటే టిడిపికి కంచుకోట అన్నారు. మా కుటుంబాన్ని భుజాలపై మోస్తున్న జిల్లాను మరింత అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకుంటామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పార్టీ నేతలు రాష్ట్రాన్ని లూటీ చేశారన్నారు. ఏ తప్పు చేయని టిడిపి నాయకులపై దొంగ కేసులు పెట్టారన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి 52 రోజులు జైల్లో పెట్టారన్నారు. చంద్రబాబు నాయుడు తలుచుకుంటే జగన్ శాశ్వతంగా జైల్లోనే ఉంటాడన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఎవరినీ వదిలేది లేదన్నారు. సూపర్-6తో ప్రజలందరికీ మేలు చేస్తామన్నారు. మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. మసీదులకు రంగులు వేయడానికి ఇచ్చే కార్యక్రమాలు యథావిధిగా కొనసాగిస్తామని తెలియజేశారు. మౌజన్లకు గౌరవేతనం కల్పిస్తామన్నారు. బీసీలకు శాశ్వత కులధ్రువీకరణ పత్రం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రానున్న రెండు నెలలు టిడిపి, జనసేనికులు నిరంతరాయంగా కష్టపడి ప్రజలను కలవాలన్నారు. సూపర్-6ని ప్రజల్లోకి తీసుకెళ్లి తెలుగుదేశం విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్, మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు జెసి పవన్ కుమార్ రెడ్డి, తాడిపత్రి జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి శ్రీకాంత్ రెడ్డితో పాటు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన మద్దతుదారుల తోపులాట

అనంతపురం శంఖారావం సభా ప్రాంగణంలో టిడిపి జనసేన పార్టీ నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. తోపులాట వాగ్వివాదం తలెత్తి కార్యకర్తలు ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. అక్కడే ఉన్న టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి నేతలకు సర్ది చెప్పి ఘర్షణను అదుపు చేశారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గం టికెట్ తమకంటే తమకంటూ జనసేన, టిడిపి మద్దతుదారులు ఘర్షణ పడ్డారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-ఉరవకొండ

నిత్యం కరువు, కాటకాలతో అల్లాడుతున్న జిల్లారైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని సిపిఎం, కాంగ్రెస్, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కాంగ్రెస్, వామపక్షాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అధికారం కోసం పాకులాడుతున్న అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు రైతుల కోసం మీరు ఏం చేస్తున్నారో స్పష్టంగా చెప్పి ఓట్లు అడగాలన్నారు. కేవలం స్వార్థ రాజకీయాలు, ఎన్నికల కోసం ప్రజల వద్దకు రావడం మానుకోవాలని సూచించారు. నియోజకవర్గవ్యాప్తంగా రైతులు అకాల వర్షాలు, అతివృష్టి, అనావృష్టి వల్ల రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలను నష్టపోయారన్నారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. మరోవైపు కరువు మండలాలు ప్రకటించారుగానీ, సహాయక చర్యలు చేపట్టలేదన్నారు. ప్రభుత్వం ఎన్నికల మోజులో పడి రైతాంగం, కార్మికులు, చిరు వ్యాపారులను పూర్తిగా విస్మరించిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులందరికీ అన్నిరకాల రుణాలు రద్దు చేయడంతోపాటు కొత్త రుణాలు మంజూరు చేయాలలని, సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు, సాగు చేయని రైతులకు రూ.20వేల చొప్పున ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, రామాంజనేయులు నాయక్, కాంగ్రెస్ నాయకులు వై.మధుసూదన్‌రెడ్డి, రామానాయుడు, వడ్ల ఆంజనేయులు, ఇంద్రావతి ఓబులేసు, పోసా రాము, అబ్బాస్, శ్రీకాంత్‌వర్మ, బ్యాళ్ల శివప్రసాద్, సూర్యానారాయణ, రమేష్, సోనియా సీనా, సుధాకర్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చెన్నారాయుడు, మల్లికార్జున పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిపిఎం, కాంగ్రెస్, సిపిఐ నాయకులు

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



అనంతపురంలో ర్యాలీ చేస్తున్న ఐద్వా, యుటిఎఫ్, శ్రామిక మహిళా కమిటీ నాయకులు

అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీలో నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించి వారి హక్కులను కాపాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని ఐద్వా, శ్రామిక మహిళా కమిటీ (సిఐటియు), యుటిఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో సోమవారం ఉదయం భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ టవర్‌క్లాక్ సర్కిల్, సప్తగిరి సర్కిల్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. అంబేద్కర్ విగ్రహానికి నేతలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. విగ్రహం ఎదుట నిలబడి మహిళా హక్కులు పరిరక్షణ కోరుతూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజు మాత్రమే స్త్రీలను గౌరవించడం అనేది కాకుండా నిత్యం మహిళలు గౌరవింపబడాలన్నారు. నేటికీ మహిళలు హింస, వివక్షతను ఎదుర్కొనే దుస్థితి దేశంలో ఉండడం విచారకరం అన్నారు. ఈ దుస్థితి పోవాలంటే మహిళలకు సమాన హక్కులు కల్పించాలన్నారు. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. మహిళలపై హింస దాడులు, హత్యలు జరగకుండా నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అందులో భాగంగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. స్త్రీలను గౌరవించడం ఇంటి నుంచే ఆరంభించి గౌరప్రదమైన దేశంగా తీర్చిదిద్దుకుందామని నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, లక్ష్మి, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వరలక్ష్మి, లక్ష్మినరసమ్మ, ఎర్రిస్వామి, తిరుమలేసు, ఇర్ఫాన్, లక్ష్మినారాయణ, వివిధ కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శింగనమలలో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

ఎన్నికల బాండ్ల వివరాలను ప్రకటించాలి

సిపిఎం ఆధ్వర్యంలో ఎస్‌బిఐల వద్ద నిరసన

ప్రజాశక్తి-శింగనమల

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే బహిర్గతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని సలకంచెరువు ఎస్‌బిఐ బ్యాంకు ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమన్నారు. నాలుగేళ్ల నుంచి ఎన్నికల బాండ్ల రూపంలో రాజకీయ పార్టీలకు వచ్చిన విరాళాలను మార్చి 6వతేదీ లోపు ఎన్నికల కమిషనర్‌కు వివరాలు సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. అయితే ఇంతవరకూ ఎన్నికల కమిషనర్‌కు వివరాల అందజేయలేదన్నారు. బాండ్లను సమర్పించకపోగా 116 రోజులు గడువు కోరడం విచారకరమన్నారు. జూన్ నాటికి ఎన్నికలు పూర్తవుతాయనే ఉద్దేశంతోనే బిజెపితో పాటు ఇతర పార్టీలు పన్నాగం పన్నాయన్నారు. వెంటనే బాండ్ల వివరాలను వెల్లడించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, సూర్యప్రకాష్, కుళ్లాయిస్వామి, వెంకటనారాయణ, మునీంద్ర, బాబు, నాగరాజు,. ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఉరవకొండ, వజ్రకరూరు మండల కేంద్రాల్లోని స్టేట్‌బ్యాంకుల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చేపట్టిన పిలుపులో భాగంగా సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. కోర్టు అడిగిన సమాచారాన్ని వెంటనే బహిర్గతం చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఇన్‌ఛార్జి మేనేజర్ పరమేశప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఉరవకొండ, వజ్రకరూరు మండలాల కన్వీనర్లు మధుసూదన్, విరూపాక్షి, జిల్లా నాయకులు రంగారెడ్డి, నాయకులు రామాంజనేయులు నాయక్, సిద్ధప్ప, వెంకటేశులు, మురళీ, రామాంజనేయులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు శంకర్, సుధ, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : ఎన్నికల బాండ్ల వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉన్న స్టేట్‌బ్యాంకు ముందు నిరసన తెలిపారు. ఇందులో భాగంగా బ్యాంకు మేనేజర్ విక్రమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఆ సమాచారం అందజేయాలని దేశ అత్యున్నత న్యాయ వ్యవస్థ సుప్రీంకోర్టు ఆదేశించినా బ్యాంకు ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు ఉన్నత న్యాయస్థానం కోరిన ఎన్నికల బాండ్ల వివరాలు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాబా ఫక్రుద్దీన్, సాయి, కిట్టన్న, నాగేష్, ముత్యాలు, సురేంద్ర, వెంకట తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్నికల బాండ్ల వివరాలను ప్రకటించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎస్‌బిఐ బ్యాంకు ముందు ధర్నా నిర్వహించారు. ఇందులో భాగంగా బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించడంలో బ్యాంకు ఉన్నతాధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే రాజకీయ పార్టీల బాండ్లను ప్రకటించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి రాము, ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు రాజేశ్వరమ్మ, ఆవాజ్ మండల కార్యదర్శి వలి, మధ్యాహ్న భోజన పథకం జిల్లా సహాయ కార్యదర్శి జయమ్మ, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఎస్‌బిఐ మెయిన్ బ్యాంకు ఎదుట సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు చీఫ్ మేనేజర్ కె.హరిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు, పట్టణ కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, కసాపురం రమేష్, మారుతీప్రసాద్, రామునాయక్, ఐద్వా పట్టణ కార్యదర్శి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.


గుంతకల్లులో వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

రాయదుర్గం : ఎన్నికల బాండ్లు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, వెంటనే భారతీయ స్టేట్ బ్యాంక్(ఎస్‌బిఐ) జారీ చేసిన ఎన్నికల బాండ్ల వివరాలను ప్రకటించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, మల్లికార్జున ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌బిఐ కార్యాల యంలో అసిస్టెంట్ మేనేజర్ మురళీకి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశా లు జారీ చేసినా అత్యధిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్నప్పటికీ అధికారులు అవసరమైన సమాచారం ఇవ్వ కుండా 3 నెలల గడువు కోరడం హాస్యాస్పదం అన్నారు. సుప్రీంకోర్టు కోరిన ఎన్నికల బాండ్ల వివరాల ను ఎస్‌బిఐ ఉన్నతాధికారులు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మరాజు, మధు, రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, తదితరులు పాల్గొన్నారు.

'శింగనమలలో టిడిపి గెలుపు బాధ్యత మీదే'

ద్విసభ్య కమిటీ సభ్యులతో నారా లోకేష్

ప్రజాశక్తి-పుట్లూరు


నారాలోకేష్‌తో నియోజకవర్గ టిడిపి నాయకులు

'శింగనమల అభ్యర్థి బండారు శ్రావణి గెలుపు మీదే బాధ్యత.. మీ బుజస్కంధాలపై వేసుకుని సమన్వయంగా కార్యకర్తలను నడిపిస్తూ గెలిపించాలి' అంటూ ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డికి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సూచించారు. సోమవారం అనంతపురంలోని పివికెకె కళాశాలలో నిర్వహించిన శంఖారావం కార్యక్రమం వద్ద ద్విసభ్య కమిటీ సభ్యులతోపాటు బండారు శ్రావణిశ్రీతో కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ముందుగా టిడిపి కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శిగా రామలింగారెడ్డి ఎన్నికైనందున నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం బండారు శ్రావణి, ద్విసభ్య కమిటీ సభ్యులు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబుతో సమావేశమై నియోజకవర్గంలోని పరిస్థితులపై ఆరాతీశారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో భారీ మెజార్టీతో శ్రావణిశ్రీని గెలిపించాలని నేతలకు సూచించారు. ఎక్కడైనా చిన్న, చిన్న విభేదాలు ఉన్నా అందరినీ ఏకతాటిగా తెచ్చి విజయం దిశగా పనిచేయాలని సూచించారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం

పెద్దవడుగూరు : గర్భిణులు ఎక్కువగా చిరుధాన్యాల ఆహార పదార్థాలను భుజించి ఆరోగ్యాన్ని పదిలం చేసుకోవాలని వైద్యులు శ్రీనివాసబాబు, అమర్‌నాథ్ సూచించారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు పోషణ పఖ్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా స్త్రీశిశుసంక్షేమశాఖ అందించే పోషకాహారాన్ని తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం ఐసిడిఎస్ సిబ్బంది చిరుధాన్యాలతో తయారు చేసిన పలురకాల ఆహారపదార్థాలను వైద్యసిబ్బంది తిలకించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజరు వెంకటలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పుష్పలత, సంజీవమ్మ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

బెలుగుప్ప : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఈనెల 12వ తేదీ నుంచి బాలికలు దరఖాస్తు స్వీకరించనున్నట్లు మండల విద్యాధికారి మల్లారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెజిబివిలో 6వ తరగతి, ఇంటర్‌తోపాటు 7, 8వ తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీ కోసం బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పెద్దవడుగూరు : కెజిబివి ప్రవేశాలకు ఈనెల 12వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంఇఒ ఉషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెజిబివిల్లో 6వ తరగతి, ఇంటర్‌తోపాటు 7, 8వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

టిడిపి నాయకుడి మృతికి నివాళి

పామిడి : గుత్తి మండలం రజాపురం గ్రామానికి చెందిన తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు (37) మృతిచెందడంతో సీనియర్ నాయకులు జీవానందరెడ్డి నివాళులర్పించారు. వేణుగోపాల్‌నాయుడు హైదరాబాద్ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. సోమవారం స్వగ్రామం రజాపురానికి మృతదేహం రావడంతో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీసీలకు అండగా టిడిపి

పెద్దవడుగూరు : బీసీ వర్గాలకు అండగా టిడిపి ఉంటోందని ఆరెకటిక సంఘం రాష్ట్ర కన్వీనర్ హరికృష్ణారావు అన్నారు. టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన జయహో బీసీ వేదికగా డిక్లరేషన్ ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ సోమవారం పెద్దవడుగూరులోని టిడిపి కార్యాలయంలో బీసీ నాయకులు చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నారాయణస్వామి, రైతుసంఘం రాష్ట్ర నాయకులు బాలరాజు, నాగన్న, రామచంద్రారెడ్డి, మల్లికార్జునరెడ్డి, వీరారెడ్డి, ఈశ్వరయ్య, దళిత సంఘం నాయకులు నగేష్, ముత్యాలు, అది, సంజీవులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌బిఎన్ అధ్యాపకురాలికి అవార్డు

అనంతపురం : ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలకు చెందిన తెలుగు అధ్యాపకురాలు వాధులపల్లి ఫిరోజకు కవితా రంగంలో కృషి చేసినందుకు నేషనల్ ఉమెన్ లెజెండరీ అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ భంసాయి సేవా ట్రస్టు, భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాలకు చెందిన మహిళలకు 'నేషనల్ ఉమెన్ లెజెండరీ అవార్డులను' ప్రదానం చేస్తుంది. ఇందులో భాగంగా ఫిరోజా చేసిన సేవలను గుర్తించి అవార్డులను ప్రదానం చేశారు.

ఉద్యోగాలకు ఎస్ఆర్ఐటి విద్యార్థుల ఎంపిక

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని ఎస్ఆర్ఐటి కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కర్నూలులోని టిసిఎస్ ఐకాన్ సెంటర్‌లో నిర్వహించిన రాత పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరిచి 38 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. వీరందరూ మంచి వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది.

ఘనంగా మహిళా దినోత్సవం

అనంతపురం : నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు, పెద్దాసుపత్రిత సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా వైద్యులు షారుణ్ సోనియా, శంషాద్ బేగం, పద్మజ, హేమలత, ప్రసూన, సిస్టర్స్ శాఖ నుంచి పుష్పలత, విజయమ్మ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లలిత, ఏఎన్ఎం కళాశాల ప్రిన్సిపాల్ యశోద, ఎఫ్ఎన్ఒ జ్యోతి, సెక్యూరిటీ స్టాఫ్ అంజలి, వైద్యులు రమాబాయి, విజయ్‌కుమారి, శారద, సునీత, నీలిమ, సుమన, గోపీచంద్, మల్లీశ్వరి, సుచిత్ర, షబానా, రేణుక, పద్మాబాయి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి యూత్ మండలాధ్యక్షుడిగా బెస్త ప్రసాద్

శింగనమల : వైసిపి యూత్ మండల అధ్యక్షులుగా బెస్త ప్రసాద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బెస్త ప్రసాద్‌ను సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి అభినందించారు. అనంతరం శ్రీరామిరెడ్డి మాట్లాడుతూ మంగళవారం మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలవ్యాప్తంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శింగనమల మత్స్యకార సంఘం కార్యదర్శి పాపారాయుడు, వైసీపీ యూత్ నాయకులు నవీన్‌కుమార్, ఉపసర్పంచి లక్ష్మీనారాయణరెడ్డి, గురుగుంట్ల సర్పంచి వెంకటరాముడు, భాస్కర్‌రెడ్డి, ఎల్.రాజు, భాస్కర్‌యాదవ్, చింటూ, బాషా, సాయి, గోపాల్‌రెడ్డి, జగన్, మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సోమవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలామురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు గౌరీ కుమారుడు తనవ్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఇవాళ దాదాపు 200 మందికి అన్నదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సౌధామణి, సుబ్రమణ్యం, సుబ్బారావు, నబిరసూల్, కిష్టప్ప, ఓబుళపతి, చంద్రశేఖర్, నాగరాజు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు

బొమ్మనహాల్ : ఎన్నప్ప ఉత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని గోవిందవాడ గ్రామ జడ్పీ హైస్కూల్ మైదానంలో వైసిపి నాయకులు, ఎన్నప్ప తాత ఆలయ ఆవరణలో టిడిపి నాయకులు వేర్వేరుగా నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఆయా పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు ఆలయ పెద్దలు ధ్రువీకరణ పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు.

సంక్షేమ పాలనను కొనసాగించుకుందాం

నార్పల : ప్రతి ఇంటికీ సంక్షేమం అందిస్తున్న సిఎం జగనన్న ప్రభుత్వాన్ని కొనసాగించుకుందామని ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని మద్దలపల్లి, నాయనపల్లి, వెంకటాంపల్లి, గడ్డంనాగేపల్లి, నడిమిదొడ్డి, కేశేపల్లి, కురగానిపల్లి, కర్ణపుడికి, పులసలనూతల, బొందలవాడ, నిలువురాయి, చామలూరు గ్రామాల్లో పర్యటించారు. మద్దలపల్లిలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న మరోసారం ముఖ్యమంత్రి అవ్వడం కోసం నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, నియోజకవర్గ పరిశీలకులు తాడిపత్రి రమేష్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు అలూరు సాంబశివారెడ్డి, నాయకులు రఘునాథరెడ్డి, నాగేశ్వరరావు, లోకనాథరెడ్డి, రమణారెడ్డి, సంజీవరెడ్డి, కేశవరెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

పెద్దపప్పూరు : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందనిఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి పెద్దారెడ్డి, యువ నాయకులు కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చాగల్లు గ్రామంలో సాయిప్రతాప్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధి హామీ పథకం సభ్యు లు వేమనాథరెడ్డి, వైసిపి జిల్లా కార్యదర్శి రవిప్రసా ద్‌రెడ్డి, మాజీ మండలాధ్యక్షులు రామ్మూర్తిరెడ్డి, చాగల్లు సూర్యనారాయణ, వాసుదేవ రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, రాంబాబు, గార్లదిన్నె సర్పంచి హేమ సుందర్‌రెడ్డి, పప్పూరు జనార్దన్‌రెడ్డి, తురకపల్లె లక్ష్మీరెడ్డి, చర్లపల్లి రాముడు, చిన్నయకలూరు ఓపిరెడ్డి పాల్గొన్నారు.


మార్కెట్ వేలం పాటలు

రాయదుర్గం : మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, కమిషనర్ పి.కిషోర్ సమక్షంలో మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్‌కు 2024-25 ఆర్థిక సంవత్సరానికి వేలంపాటలు నిర్వహించారు. దినస రి కూరగాయల మార్కెట్‌ను రూ. 35,10,000కు అరవింద్‌బాబు, వారపు సంత మార్కెట్‌ను రూ. 15,20,000కు పూజారి తిప్పయ్య, జంతు వధశాల మార్కెట్‌ను వాల్మీకి పవన్ రూ. 3,50,000కు దక్కించుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరం వేలంతో పోల్చితే ఈమారు రూ. 19,31,000 అదనపు ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

మహిళల ఆర్థికస్వావలంబనే ధ్యేయం

'ఆసరా' కార్యక్రమాల్లో నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ


ఉరవకొండ మండలంలో మెగా చెక్కు అందజేస్తున్న నాయకులు

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతోపాటు చైతన్యవంతులు చేయడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకర్‌నారాయణ అన్నారు. సోమవారం ఉరవకొండ, విడపనకల్ మండలాల్లో వైఎస్ఆర్ చేయూత సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి సీఎం జగన్ పెద్దపీట వేసి అండగా నిలిచారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మందికి ఇంటిస్థలాలు కేటాయించడంతోపాటు ఇళ్లు కూడా మంజురు చేసినట్లు తెలిపారు. సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థల ద్వారా ఓవైపు సంక్షేమం.. మరోవైపు అభివృద్ధిని కొనసాగిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరంఉరవకొండ మండలంలోని 4600 మంది లబ్ధిదారులకు రూ.8.62 కోట్లు, విడపకకల్ మండలంలోని 3170 మంది లబ్ధిదారులకు రూ.5.94కోట్ల మెగా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు నరసింహులు, కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, లలిత, పార్వతమ్మ, హనుమంతు, తేజోనాథ్, గోవిందు, బసన్న, ఏసీ.ఎర్రిస్వామి, సుంకన్న, ఓబన్న, భరత్‌రెడ్డి, ఆసిఫ్, దేశాయ్ సిద్ధార్థ, సుంకన్న, ఉమాశంకర్, రఘురాములు, గిరిబాబు, బసవరాజు, కరణం భీమిరెడ్డి, నాగరాజు, గాజుల.వెంకటేసులు, ఎంపిడిఒ అమృతరాజ్, కెసి.కొండయ్య, అడ్మినిస్ట్రేషన్ అధికారి భాస్కర్, ఇఒఆర్‌డి సత్యాబాబు, ఎపిఒ రామమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ఫాక్షన్‌తో గ్రామాల్లో రక్తం పారిస్తే.. వైసిపి అధికారంలోకి వచ్చాక కాలువలు తవ్వించి నీరు పారిస్తున్నామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో 'జగనన్న చేయూత' కార్యక్రమాలు నిర్వహించారు. పి.యాలేరు, పంపనూరు గ్రామాల్లో నూతన సచివాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లులకు అమ్మఒడి పథకం ద్వారా లంచం ఇచ్చి పిల్లలను చదివిస్తున్న మేనమామ సిఎం జగన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇంటి పంటాలిచ్చామన్నారు. ఇవి జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రానికి అప్పుగా తెచ్చిన రూ.2.50 లక్షల కోట్లు సింగపూర్, మలేషియా, హాంకాంగ్ కంపెనీల ఖాతాల్లోకి వెళ్లామని విమర్శించారు. బడాబాబుల ఖాతాల్లోకి మళ్లించి వారి నుంచి కమీషన్లు దండుకున్నాడని ధ్వజమెత్తారు. ఇలాంటి వారి మాటలు నమ్మకుండా మీకు మంచి చేసిన సిఎం జగన్‌ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు


కరపత్రాలు అందజేస్తున్న టిడిపి నాయకులు

తెలుగుదేశం పార్టీ ద్వారానే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల ఇన్‌ఛార్జి బాలాజీ, మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని పి.యాలేరులు 'బాబు షూరిటీ-భవిష్యత్తు'కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. కాగా మండలంలోని వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పులుగూరు పోతిరెడ్డి టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గడిపూడి నారాయణస్వామి, బండి పరశురాం, శశాంక్‌చౌదరి, రమేష్‌నాయుడు, మనోరంజని, కృష్ణమోహన్‌చౌదరి, వెంకటనారాయణ, సూర్యనారాయణ, రవీంద్రారెడ్డి, గుజ్జల వెంకటేష్, రాజా, రమేష్, బెస్త తిమ్మరాయుడు, ఆనంద్, రవితేజారెడ్డి, సాయినాథ్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, భూమయ్య, మహేష్, చెన్నప్ప, రామకృష్ణ, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, మారెక్క, జయశ్రీల, లక్ష్మీదేవమ్మ, పద్మావతమ్మ, చెన్నమ్మ, బాలానాయక్, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : ఐదేళ్లుగా ప్రజా వ్యతిరేక పాలనను సాగిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్న వైసిపి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయులు విక్రమ్‌సింహా, విజయసింహా పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని యలగలవంక, నరసాపురం, గొల్లలదొడ్డి గ్రామాల్లో 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ముందుగా గ్రామ ప్రజలు గజమాలలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలి

ఉరవకొండ : గర్భిణులు వైద్యులు సూచించిన ఆరోగ్య మెళకువలు, సలహాలను పాటించి ఆరోగ్యంగా ఉండాలని రాకెట్ల ప్రభుత్వ వైద్యాధికారి వెంకటేష్‌నాయక్ సూచించారు. సోమవారం మండలంలోని రాకెట్ల ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 33 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గర్భిణులు సరైన పోషకాహారం తీసుకోవడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కాగా లింగవివక్ష సరికాదన్నారు. అడ, మగ పిల్లలిద్దరూ సమానమేనని, భ్రూణ హత్యలకు పాల్పడితే శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎంఎస్ షఫీ, హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్ స్వర్ణలత, స్టాఫ్‌నర్సులు సునీత, జినతున్నీసా, ఫార్మాసిస్టు మంగమ్మ, సిహెచ్‌ఒలు భవానీ, నాగసురేఖ, ఏఎన్ఎంలు లలిత, పద్మావతి, ఛాముండేశ్వరి, సలీమా, ల్యాబ్ టెక్నీషియన్ రాణి ఎస్తర్, సీఓ.భగవాన్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగకు తెగుళ్లు

అనంతపురం : రబీ సీజన్‌లో రైతులు బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటకు కాండం కుళ్లు తెగుళ్లు ఆశిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఉపసంచాలకులు సి.మద్దిలేటి తెలిపారు. సోమవారం అనంతపురం రూరల్ మండలంలోని మన్నీల గ్రామంలో బోరుబావులు కింద సాగు చేసిన వేరుశనగ పంట పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వేరుశనగ పంట కాయలు ఊరే, గింజ పట్టే దశలో ఉన్నందున కాండం కుళ్లు తెగుళ్లు ఎక్కువగా ఆశించినట్లు గమనించామన్నారు. నివారణకు తెగుళ్లు సోకిన మొక్కలు చుట్టూ రెండు మిల్లీ లీటరు హెక్సంజోల్ ఒక లీటర్ నీటికి కలిపి నేల బాగా తడిచేటట్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు శైలజాకుమారి, వ్యవసాయ అధికారులు శ్రీనివాసులు, శంకర్‌లాల్ నాయక్, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం : ఎమ్మెల్యే

గుత్తి : పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా సీఎం జగన్ పని చేస్తున్నారని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని జంగాలకాలనీ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆయుష్మాన్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల వైద్య సేవల కోసం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఫ్యామిలీ డాక్టర్‌తో పాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చారన్నారు. అన్నిరంగాల ప్రజల అభ్యున్నతి జగనన్నతోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి జగనన్నను సీఎం చేయాలని కోరారు. ముందుగా స్థానిక మార్కెట్ యార్డులో వైఎస్ఆర్ చేయూత కార్యక్రమంతోపాటు నూతనంగా నిర్మించిన వైయస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.వన్నూరుబీ, బి.వరలక్ష్మి, జి.విశాలాక్షి, బోగాతి మురళీమోహన్‌రెడ్డి, సి.సునీలాయాదవ్, బేడల లక్ష్మీదేవి, బి.శ్రీనివాస్‌రెడ్డి, కోనా మురళీధర్‌రెడ్డి, డి.హుస్సేన్‌పీరా, జి.గోవర్ధన్‌రెడ్డి, బేడల వెంకటరాముడు, బి.రాజ్‌కుమార్‌రెడ్డి, వై.సుభాష్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌యాదవ్, అశ్వ రాముడు, ఎన్.ఫారూఖ్, వి.వరద, రమణ, బేడల రమేష్, అశ్వ పెద్ద మారెన్న, నాగప్ప, చిన్న మారెన్న, కమిషనర్ జి.శ్రీనివాసులు, ఎడిఎ ఎం.వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని తలారి చెరువు గ్రామంలో పేదలకు మంజూరైన ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభివృద్ధే ధ్యేయంగా తలారి చెరువు గ్రామంలో జగనన్న కాలనీని నిర్మించామన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్న ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జెసి పవన్‌ను కలిసిన సుధాకర్

శింగనమల : టిడిపి నాయకులు జెసి పవన్‌కుమార్‌రెడ్డిని మండలానికి చెందిన బోయ సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి నియోజకవర్గ పరిస్థితులను వివరించారు. అందరూ కలిసికట్టుగా పని చేయాలని పవన్ సూచించినట్లు సుధాకర్ తెలిపారు. పవన్‌ను కలిసిన వారిలో టిడిపి నాయకులు లోకనాథ్, రంగమ్మ, ఆదిశేషు, చెన్నమయ్య, నాగేంద్ర, కాటమయ్య పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు

ఉరవకొండ : ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో నూతనంగా నిర్మించనున్న ఆరు ఆలయాలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ, తిరుమల తిరుపతి దేవాస్థానము బోర్డు ద్వారా నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం తట్రకల్లులో సుంకులమ్మ దేవస్థానం, గంజికుంటలో మారెమ్మ, గూళపాళ్యం లో రామాలయం, చాబాలలో చాబాలమ్మ, గుంతకల్లు నియోజకవర్గంలోని పామిడి మండలం దేవరపల్లిలో పెన్నబిలేసు స్వామి, గుంతకల్లు మండలం చింతలాంపల్లి గ్రామంలో సుంకులమ్మ దేవత ఆలయాల నిర్మాణానికి ఒక్కో ఆలయానికి రూ.10లక్షలు చొప్పున మంజూరు చేయించినట్లు తెలిపారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్జాతీయ పోటీలకు పామిడి శ్రీచైతన్య పాఠశాల ఉపాధ్యాయుడు



పామిడి : మండల కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొమ్మల రాజశేఖర్ జాతీయ టెన్నిస్‌బాల్, క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఫిబ్రవరి 2 నుంచి 5వ తేదీ వరకూ తమిళనాడులోని రామనాథపురంలో జరిగిన పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా సెక్రటరీ ఆంజనేయులు తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన రాజశేఖర్‌ను పామిడిలోని శ్రీచైతన్య పాఠశాల సీఈవో సంతోష్‌రెడ్డి, డైరెక్టర్ రమణారెడ్డి, తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

రాయదుర్గం రూరల్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పక పాటించాలని ఈఆర్ఓ కరుణకుమారి ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని ఐదు మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈఆర్ఓ మాట్లాడుతూ అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు నడుచుకోవాలన్నారు. ఓటర్లకు అవగాహన కల్పించడం, రాజకీయ పార్టీలు మోడల్ కోడ్ కాండక్ట్ మేరకు నడుచుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో ప్రదర్శన ద్వారా విధి, విధానాలను తెలిపారు. పోలింగ్ రోజున నివేదికలు సకాలంలో పంపించాలన్నారు. శిక్షణ తరగతుల్లో స్టేజ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించాలి

రాయదుర్గం : పట్టణంలో నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచి, నీటి ఎద్దడిని నివారించాలని పాలక మండలి సభ్యులు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప అధ్యక్షతన సోమవారం పాలక మండ లి సాధారణ సమావేశం నిర్వహించారు. సభ్యులు ప్రశాంతి, గోవిందరాజులు, లావణ్య, తదితరులు మాట్లాడు తూ తాగునీరు, విద్యుత్ దీపాల సమస్యలను లేవనెత్తడంతో పాటు వట్లకుంటలో మురికినీరు వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీటి నిల్వలు పరిమితంగా ఉండడంతో 3 రోజులకోసారి సరఫరా చేస్తున్నామనిమున్సిపల్ ఇంజినీర్ కోదండ తెలిపారు. ఈ నెల 15వ తేదీ తర్వాత 2 రోజులకోసారి వదులుతామన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఎఇ సూచించా రు. వీధి దీపాలను తెప్పించామని అన్ని వార్డులకు సమానంగా కేటాయిస్తామని కమిషనర్ కిషోర్ తెలిపారు. అజెండాలోని ఓ అంశం మినహా ఇతర వాటికి కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సమావేశంలో వైస్ ఛైర్మన్లు శ్రీనివాస్ యాదవ్, వలీబాషా, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.